అందులోనూ నూత్నప్రేమికులకు ఇందులో గంభీరార్థంవుండితీరుతుంది!

రిక్షా ఎక్కిన సిగ్గు

[చిన్న కథ]

" స్వామిబుజంమీద చెయ్యి మోపుతూ సరోజ రిక్షా ఎక్కింది. అంతేకాదు లక్ష్మణస్వామికి తన కుడిచేతిని అందిచ్చి రిక్షా ఎక్కేటప్పుడు సాయంచేసింది."

రచయిత:
తోలేటి గంగాధరము, ఎం.యే.

పిండి ఆరబోసి నరీతిగా వుండే వెన్నెలలేదు- ముగ్ధమోహనమైన సంగీతంలేదు- చల్లగాలివీచే సముద్రతీరవిహారంలేదు - పూవుల వాసన గుబాళించే తోట లేదు- కృతజ్ఞతాపూర్వకమైన మాటలులేవు - అంగాంగసంస్పర్శ లేదు- భావోన్మాదం లేదు.

ఈ పరికరాలు ఏమీ లేకుండానే సరోజకు ప్రేమపుట్టింది. ఆ ప్రేమ ఆమెకు హఠాత్తుగా, అనుకోకుండా విద్యుద్వేగంతోవచ్చింది.

మొదటిచూపులోనే మన్మధోద్రేకం. సరోజకు లక్ష్మణస్వామికి కలిగిన అనుభవం అది.

సరోజ మెడికల్ కాలేజీలో చేరిననాడే ఈప్రేమప్రభావం ఆమెకు కలిగింది. ఆమె అంతవరకు సిగ్గరి. మెడికల్ కాలేజీనుంచి బయటపడే సరికి ఆమె లేడీడాక్టరు అవుతుంది. దేవుడు అన్నివిధాలా తిన్నగా చూస్తే అది ఐదేళ్ళనాటిమాట!

ఆమె కాలేజీని సమీపించింది. మంద మంద గమనంతో తనక్లాసు రూములోనికి వెళ్ళింది. అచ్చటికి ఆవరకే లక్ష్మణస్వామి వచ్చివున్నాడు. ఆగదిలో అతడు తప్ప ఇంక ఎవరూలేరు. అప్పుడు ఆ సిగ్గరికత్తె వదనంమీద విభ్రాంతి విహ్వాలించింది. బిత్తరపుచూపుతో ఆమెగది అంతా పరికించింది.

లక్ష్మణస్వామి విశాలవిశేష నేత్రాలు ఆమె చంచలేక్షణాల్ని పరకాయించాయి. ఆమె మనస్సు భావశూన్యమైంది. అయినా ఆమె మనోఫలకంమీద ఆతని వ్యాయామనుస్నిగ్ధమైన ఆజానుబాహు విగ్రహం ముద్రితమైంది.

తోడనే ఆమె శరీరం అంతటా ఒక విద్యుత్కిరణం ప్రసరించింది. ఫలితంగా ఆమెముఖం ఒక్కసారిగా వెల్లబోయింది. ఆవెల్లదనాన్ని కప్పిపుచ్చడానికి ఆమె ఒకసారి తల వాల్చింది. మరిఒకసారి తలపైకి ఎత్తింది. ఎర్రని పెదవులమీద మొలకనవ్వు ఉద్గారితం చేస్తూ ఆమె వెనుదిరిగి చటాలున వెళ్ళిపోయింది.

వెళ్ళిపోతూవుండగా ఆమెకు జ్ఞాపకంవచ్చింది. ఇంటిదగ్గరనుంచి చాలా పెందరాలే బయలుదేరాననీ - మార్గ మధ్యంలో బజారులో ఫవుంటెన్ పేనా కొనుక్కుందామనుకున్నాననీ- ఆసంగతి మరిచిపోయి నేరుగా కాలేజీకివచ్చేశాననీ ఆమె జ్ఞాపకం చేసుకుంది. మతిమాలి ఆమె కాలేజీకి ఒకగంట ముందుగా వచ్చింది.

అయితే క్లాసురూములో ఆ పురుషవ్యక్తి ఎవ్వడు? ధవళ ధవళాలైన ఖద్దరు దుస్తులు కట్టిన ఆ యువకుడు తన సహాధ్యాయుల్లో ఒకడా! తనకు మళ్ళేనే మతిమాలి అతడుకూడా చాలా పెందరాళే కాలేజీకి వచ్చాడా ?

ఆమె తిరిగి వీధిలోకి వచ్చింది. కాని ఇంతలోనే ఆమె ప్రేమతో ఆర్ద్రమైపోయింది. ఆసంగతి ఇంకా ఆమెకు పూర్తిగా తెలియక పోవచ్చును. మొదటిచూపులో ప్రేమ! కాని ఆమె అది అట్టిదిగా అనుకోలేదు. ప్రేమ అట్లే తనప్రభావాన్ని ప్రసరిస్తుంది కాబోలు!

ఒక విద్యుత్కిరణం ఆమెలో ఆయువకుణ్ణి చూచినప్పుడు ప్రసరించినమాట నిజమే. కాని అది అంతలో ప్రేమగా పరిణామం పొందుతుందా !

౨

అతడు ఆమె సహాధ్యాయుడే. ఒకరికి ఒకరికి పరిచయమైంది. కాని అతన్ని కళ్లెత్తి చూచినప్పుడల్లా, అతనితో పళ్లెత్తి పలికినప్పుడల్లా ఆమెకు అదోవిధమైన ఇట్టిది అట్టిది అని చెప్పరాని వికారభావం కలిగేది. మనస్సులో ఏదో చెయ్యవేసి కలచినట్లు అయ్యేది— కొంత కాలానికి ఆమెకు అర్థమైంది అతడు తన హృదయాన్ని చూరగొన్నాడని–

అతన్ని మరిచిపోదామని ఆమె అనుకున్నది. కాని సాధ్యంకాలేదు. అతని చూపుల్లో ఏదో సమ్మోహనాస్త్రం వుంది.

కాబట్టి పరిచయమైన రెండు మాసాలకే వారి హృదయాలు ప్రణయమూర్ద్రాలు అయాయి. లక్ష్మణస్వామి తనప్రేమను అనేకవిధాల ఆమెకు తెలియచేసే సూచనలు చేస్తూ వచ్చాడు.

సరోజమాత్రం సిగ్గరికత్తె. ఆమెకు అవి అస్తమానూ అర్థమయ్యేవి కావు. ఆసంగతి లక్ష్మణస్వామికి మరింతబాధను కలిగించేది.

3

సాధారణంగా కాలేజీకి లక్ష్మణస్వామి, సరోజ ముందుగా వచ్చేవారు. ఒక్కొక్కప్పుడు అతను ముందు. ఒక్కొక్కప్పుడు ఆమె ముందు.

ఒకనాటి ఉదయాన్ని లక్ష్మణస్వామి ముందు వచ్చాడు. తన డ్రాయరులో పుస్తకాలు పెట్టుకుని ఒక సిగరెట్టేనా కాల్చుకు వద్దామని బయటికి వెళ్లాడు. తిరిగి వచ్చి అతడు తన హృదయానికి నిర్భరమైన ఆనందాన్ని ఇచ్చిన ఒక సంఘటన చూశాడు.

అప్పుడే సరోజవచ్చి వుంది. ఆ గదిలో ఇంక ఎవరూలేరు. నిశిత దృష్టులతో ఆమె గదిఅంతా పరకాయించింది.

లక్ష్మణస్వామి డ్రాయరువద్దకు వెళ్ళింది. నెమ్మదిగా దానిని తెరిచింది.

అతని పుస్తకాలు ఆమెకు స్వాగతమిచ్చాయి. తోడనే ఆమె ముఖంమీద మధురమందహాసం పొడసూపింది. తనకంటె ముందే అతడు వచ్చాడన్నమాట ! అతని పుస్తకాల్లో ఒకదానిని ఆమె ఎత్తి పైకితీసి తన వక్షస్థలానికి అద్దుకుంది. అద్దుకుని దానిని యథాస్థలంలో పెట్టివేసింది.

సిగరెట్టు తాగి వస్తూవస్తూ లక్ష్మణస్వామి చూసిన ఆత్మకింపైనదృశ్యం ఇది.

తోడనే అతనికి వొక విధమైన ఉదుటు వచ్చింది. వెంటనే వెళ్ళి ఆమెను కౌగలించుకుని తన ప్రేమను వెల్లడించాలని అనుకున్నాడు.

కాని అతణ్ణిచూడ్డంతోటే ఆమె పొందిన బిత్తరితనాన్ని కనిపెట్టి అతడు తన సాహసకృత్యాన్ని మానివేశాడు.

చెప్పడానికి, వినడానికి విషయం సాధారణమైందిగానే కనిపిస్తుంది. కాని ప్రేమికులకు అందులోనూ నూత్నప్రేమికులకు ఇందులో గంభీరార్థం వుండితీరుతుంది !

ఇట్టి సంఘటనలు ఇంకా ఎన్నో జరిగాయి. సరోజ తనపట్ల విశేష ప్రేమ చూపుతూవున్నదని లక్ష్మణస్వామికి అవగతమైంది. అయినా అనేకమైన అనుమానాలు అతని వెన్నంటి వేపించుకు తింటూ వుండేవి. ఏదో ఒకసారి ముఖాముఖిని ఆమెను అడిగివేద్దామని అతనికి వుండేది.

కాని ఆమె అమితమైన సిగ్గరికత్తె. అతన్ని చూచీచూడ్డంలో ఆమె బిత్తరపోయేది. ఆమె బిత్తరిపాటుచూచి అతడు తెల్లబోయి నోట మాటలేకుండా వుండిపోయేవాడు.

౪

ఇట్లా వుంటూవుండగా ఒకనాడు ఒక చక్కని సంఘటన జరిగింది.

అదేతరగతిలో విలియమ్ అనే యువకుడు, మేరీ అనే యువతి— ఆంగ్లోఇండియన్‌లు— చదువుతూ వుండేవారు. వారు ఇద్దరూ ప్రేమికులు. ఆసంగతి ఆకాలేజీలో అంద

[మిగతా ౪౫-వ పేజీలో.

రిక్షా ఎక్కిన సిగ్గు

[౨౮-వ పేజీ తరువాయి.]

రికీ తెలిసిన విషయమే.

మేరీ తన తలిదండ్రులతో నివశిస్తూవుంది. విలియమ్కూ వారి ఇంట్లోనే వుంటూవున్నాడు.

విలియమ్‌తో లక్ష్మణస్వామి తన ప్రేమసంగతి తెలుపుకున్నాడు. దానిమీద వారిద్దరూ కలిసి ఒక ఎత్తు ఎత్తారు.

విలియమ్, మేరీలు ఒకనాటి సాయంకాలం లక్ష్మణస్వామిని, సరోజను తమయింటికి కాఫీకి పిలిచారు. ఆనాడు వారియింట్లో పియానోవాద్యంకూడా ఏర్పాటు చేసారు.

కాలేజీనుంచి నేరుగా అందరూ మేరీయింటికి వెళ్ళడానికి ఏర్పాటు. మొదట సరోజ చాలా సిగ్గుపడింది. రానంటే తనకు గర్వం అనుకుంటారేమో అనే భయం. వెళ్ళడానికి వల్లమాలినసిగ్గు. ఆలోచించి ఆలోచించి ఆమె ఆఖరికి అంగీకరించింది.

అప్పుడు లక్ష్మణస్వామి మనస్సులో పొందిన ఆనందానికి అవధి లేదు. విలియమ్, మేరీలు ఇంటివద్ద మోగిగే తీరుచూచి సరోజ తన లజ్జను వదులుకుంటుందనీ—అక్కడ సంగీతపు జోరుచేత పారవశ్యాన్ని పొందినప్పుడు సరోజకు తన సంగతి చెప్పివేయవచ్చుననీ లక్ష్మణస్వామి ఉవ్విళ్లూరాడు.

వెళ్లేటప్పుడు నలుగురూ కలిసే వెళ్లారు. కాఫీ, ఫలహారాలు; ఆపిమ్మట సంగీతం—

ఇంతసేపూ సరోజ మౌనంగానే వుంది. సంగీతం తరవాత విలియమ్, మేరీ కలిసి నృత్యంచేశారు. విప్పారినకళ్ళతో, విభ్రాంతిపొందిన మనస్సుతో సరోజ ఆనృత్యాన్ని చూస్తూ కూచుంది.

*

రాత్రి ఎనిమిది గంటలయింది. ఇక వెళ్ళడానికి వేళ అయిందనే సంగతి లక్ష్మణస్వామికి గుర్తు వచ్చింది. తోడనే అతడు లేచి సరోజకు ఆసంగతిచెప్పి విలియమ్, మేరీలవద్ద సెలవుతీసుకుని బయలుదేరారు.

బస్సుస్టాండువైపు పోతూవున్నారు. దారిలో లక్ష్మణస్వామి సరోజ చెయ్యిపట్టుకున్నాడు.

ఆమె నిరోధించలేదు. అర్థయుక్తంగా అతడు ఆమెచేతిని నొక్కి ఒత్తాడు. ఇది నీపదార్థమే అన్నట్లుగా ఆమె ఊరుకుంది.

ఈలోగా బస్సుస్టాండ్ సమీపానికి వచ్చారు.

తలవంచుకునే సరోజ 'బస్సు ఎక్కుదామా' అంది.

'వద్దు రిక్షామీదపోదాము' అన్నాడు లక్ష్మణస్వామి.

సరోజ అనంగీకారాన్ని సూచించలేదు. లక్ష్మణస్వామి పిలవగా రిక్షావచ్చింది. స్వామిబుజంమీద చెయ్యిమోపుతూ సరోజ రిక్షా ఎక్కింది. అంతేకాదు లక్ష్మణస్వామికి తన కుడిచేతిని అందిచ్చి రిక్షా ఎక్కేటప్పుడు సాయంచేసింది.

లక్ష్మణస్వామి, సరోజల మొగాలు విప్పారి మందహాసాంచితాలయాయి. రిక్షా చురుకుగా వెళ్ళిపోతూవుంది—

ఇంతకీ ఇప్పుడు సరోజ సిగ్గు ఏమైంది ?

నన్నెచోడకవి

[౨౬-వ పేజీ తరువాయి.]

నన్నిచోడకవి చెప్పుకొనుట, బిరుదపర్యాయమే కాని, నిజరాజధానీ పురాధిపత్యము కాదని చెప్పక తప్పదు.

ఇంతికును పెదచెరుకూరి శాసనములోని పాకనాటి చోడులకును–నన్నెచోడుని కుమారసంభవంలో ప్రస్తావింపబడిన పాకనాటి చోడులకును భేదములేదు.

Printed at the Andhrabhumi Printing Works, Vepery, Madras.
Editor & Publisher: Andra Seshagiri Rao. B.A.